జిందగీ
# చింతన
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 10 ఫిబ్రవరి 2025
www.ntnews.com
9

# మార్పును ఆహ్వానిద్దాం

దేహినోఽస్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా।
తథా దేహాంతర ప్రాప్తిః ధీరస్తత్ర న ముహ్యతి!
(భగవద్గీత - 2- 13)

**'జీవాత్మకు** ఈ దేహమునందు కౌమారము, యౌవనము, వార్ధక్యము ఉన్నట్లే మరొక దేహప్రాప్తి (మరణము) కలుగుతుంది. ధీరుడు అంటే ప్రాజ్ఞుడైనవాడు ఈ విషయం పట్ల మోహితుడు కాడు' అని అంటున్నాడు కృష్ణపరమాత్మ. ప్రకృతిలో మార్పు ఎలాగైతే సహజమో... శరీరానికీ మార్పు సహజమే. 'దేహే' అనడం వల్ల అది శరీరానికే పరిమితం గాని ఆత్మకు కాదని స్పష్టమవుతున్నది. ఒక అవస్థ నుంచి మరొక అవస్థకు చేరడం మార్పు. మొదటి మూడు అవస్థలకు బాధపడని మనిషి మరణం సమయంలో మాత్రం బాధపడతాడు.

**ప్రతి** వ్యక్తిలో రెండు శక్తులు ఉంటాయి. ఒకటి పురుషశక్తి, రెండోది స్త్రీశక్తి. పురుష శక్తి సృజనాత్మకతకు సంబంధించినది కాగా.. స్త్రీ శక్తి పరిస్థితులకు అనుగుణంగా మారే లక్షణానికి సంబంధించినది. వ్యక్తి విజయాన్ని సాధించాలంటే స్త్రీ-పురుష శక్తులను రెండిటినీ సమన్వయం చేసుకోవాలి. ఎదురయ్యే పరిస్థితులను అవగాహన చేసుకోవడం, అంగీకరించడం వల్ల మనసుకు కలిగే ఒత్తిడిని అధిగమించి సరైన విధంగా స్పందించే అవకాశం ఉంటుంది. చాలామంది మనసులలో ఒకలాంటి బిరుసుదనం ఉంటుంది. పరిస్థితులకు అనుగుణంగా మారేందుకు ఇష్టపడరు. మారనని భీష్మించుకొని కూర్చునే మానసికస్థితిని, అరక్షితమైన వలయంలో తమను తాము బంధించుకునే తత్వానికి ప్రతీకగా చూడాలి. అలాంటివారు కొన్ని పూర్వ నిశ్చితాభిప్రాయాలను ఏర్పరచుకొని, ఆ కోణంలోనే ప్రపంచాన్ని చూస్తూ.. ఆ పరిధిని అతిక్రమించేందుకు అంగీకరించరు. ఆ అభిప్రాయాలకే బందీలవుతారు. యదార్థ స్థితికి.. మన అభిప్రాయాలకు మధ్య వైరుధ్యం ఏర్పడినప్పుడు సంఘర్షణ అనివార్యం అవుతుంది. దానికి ప్రత్యామ్నాయంగా సామరస్యతను సాధించగలిగితే జీవితం ప్రశాంతతను సంతరించుకుంటుంది.

గీతావాక్యం



ఆలోచన చేయడం, అనుభూతిని పొందడం, అవగాహన చేసుకోవడం.. ఈ మూడూ మూడు స్థాయిలలో అర్థం చేసుకోదగిన అంశాలు. కానీ, సాధారణంగా ఎక్కువమంది ఆలోచనా స్థాయిలోనే ఆగిపోయి ఒక నిర్ణయానికి వస్తారు. ఆ కోణం నుంచే సమస్యను చూస్తారు కాబట్టి వారిలో గందరగోళం ఏర్పడుతుంది. ఇది సంఘర్షణకు దారితీస్తుంది. ఎదురుగా నిలిచిన పెద్ద వటవృక్షాన్ని సైతం కూల్చివేసే ప్రవాహవేగానికి తలొగ్గిన పబ్బలి చెట్టును ప్రవాహం ఏమీ చేయలేదు. ప్రవాహం తగ్గాక పబ్బలి చెట్టు మళ్లీ తలెత్తుకు నిలుస్తుంది. ఎప్పుడైతే సన్నివేశం మనకు ప్రతికూలంగా మారుతున్నదో దానిని ఎదిరించకుండా దానిని మనకు అనుకూలంగా మార్చుకునే ఆలోచన చేయాలి. అంటే ఆలోచన విస్తృతం కావాలి. అప్పుడది సానుకూలమవుతుంది. దానినే చాతుర్యం అంటారు. నిజానికది చెప్తే వచ్చేదికాదు.. ఆ నైపుణ్యాన్ని పట్టుకోవాలి.

**మార్పు** అనేది జీవితంలోనైనా, వ్యాపారంలోనైనా, ఉద్యోగంలోనైనా సహజప్రక్రియ. మారనని భీష్మించుకు కూర్చుంటే సమయమే మనలను మారుస్తుంది. అవసరాన్ని గుర్తించి.. మార్పునకు సన్నద్ధమవ్వాలి. మారకపోతే ఎదురయ్యే ప్రమాదాలను, లాభనష్టాలను గుర్తించాలి. సమగ్రమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకొని దాని ప్రకారం మార్పును ఆహ్వానించాలి. ప్రణాళికను నిబద్ధతతో అమలుచేయడం, నిర్దిష్ట కాలావధిలో దానిని సమీక్షించుకోవడం.. అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవడం వల్ల కాలానుగుణంగా మారడం సులువు అవుతుంది.

**అరవై** సంవత్సరాలు దాటిన ఒక వ్యక్తి స్విమ్మింగ్‌పూల్‌లో నీటిపై తేలుతూ ఆనందిస్తాడు.. కానీ, ధ్యానంలో పది నిమిషాలు కూర్చోవాలంటే కాళ్లు నొప్పులంటాడు. ఆ వ్యక్తి మారడానికి ఇష్టపడక తనకు తానుగా ఇచ్చుకున్న స్వయం సూచనలకు అనుగుణ ఫలితాలే. కొడాక్, బ్లాక్ బస్టర్, హెచ్‌యంటీ, మర్ఫీ రేడియో, అంబాసిడార్.. తదితర సంస్థలు ప్రపంచ మార్కెట్‌ను ఒకనాడు శాసించినా.. మార్పును అవగాహన చేసుకోలేక.. ఆహ్వానించలేక చతికిలపడ్డాయి. అందుకనే కృష్ణపరమాత్మ 'సహజ ప్రక్రియయైన మార్పును అంగీకరించండి, ఆహ్వానించండి.. ఆనందంగా జీవించండి' అని అర్జునుడికే కాదూ, మనకూ ఉపదేశించాడు.

... పాలకుర్తి రామమూర్తి

కథాసుధ

# ఇంద్రధనుస్సు

ఓ భౌతికశాస్త్ర అధ్యాపకుడు స్వామివారి దర్శనానికని తిరుమలకు కాలినడకన బయల్దేరాడు. అలిపిరి మొదటి మెట్టుకు కర్పూర హారతి ఇచ్చి, టెంకాయి కొట్టి నడక ప్రారంభించాడు. దారిలో ఒక యువ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పరిచయమయ్యాడు. మూడు వందల మెట్లు ఎక్కేసరికి ఆ యువకుడికి కాళ్లనొప్పులు ప్రారంభమయ్యాయి. 'ఇంకెన్ని మెట్లు ఉన్నాయో...' అంటూ అస్సుబుస్సుమని గసపోసుకుంటూ చాలా కష్టంగా ఎక్కుతూ ఉన్నాడు. ఆ యువకుడి బాధ చూసి అధ్యాపకుడు చిన్నగా నవ్వుకున్నాడు. మోకాళ్ల పర్వతం వచ్చేసరికి ఆ యువకుడు బాగా అలసిపోయాడు. ఏడుపు ముఖం పెట్టిన యువకుడు అధ్యాపకుడితో 'దేవుణ్ని చూడటానికి ఇన్ని కష్టాలు పడాలా?' అని ప్రశ్నించాడు. అధ్యాపకుడు నవ్వి ఊరుకున్నాడు. ఇంతలో కుండపోత వాన మొదలైంది. జోరు వర్షాన్ని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టాడు ఆ యువకుడు. ఇద్దరూ గబగబా వెళ్లి ఓ పెద్దచెట్టు కింద నిలబడ్డారు. కొద్దిసేపటికి వర్షం ఆగిపోయింది. ఆకాశంలో ఇంద్రధనుస్సు వెలిసింది. ఆ యువకుడి కళ్లు మెరిశాయి. దాన్నే చూస్తూ అక్కడే నిలబడ్డాడు. 'నీకు ఇంద్రధనుస్సు అంటే అంత ఇష్టమా?' అని అడిగాడు అధ్యాపకుడు. 'చాలా ఇష్టం సార్ ... ఆకాశంలో అరుదుగా కనిపించే ఆ అందాల హరివిల్లును చూస్తూ ఉంటే నాకు ఆకలి ఉండదు, దాహమూ ఉండదు' అని బదులిచ్చాడు. యువకుడి ముఖంలోకి చూస్తూ 'వాన అంటే ఇష్టం లేదా?' అని అడిగాడు అధ్యాపకుడు. 'వానంటే నాకు గిట్టదు. వానపడితే నాకు అసౌకర్యంగా, ఇబ్బందిగా ఉంటుంది' అని సమాధానం ఇచ్చాడు యువకుడు. దానికి అధ్యాపకుడు నవ్వుతూ 'వాన రాకుంటే ఇంద్రధనుస్సు ఆకాశంలోకి ఎలా వస్తుంది. మనకు ఇష్టంలేదని వాన రాకపోతే ఇంద్రధనుస్సు ఆకాశంలోకి వచ్చే అవకాశమే లేదు. అలాగే ఈ కొండ మెట్లు ఎక్కడం కష్టంగా తోస్తే ఆ దేవదేవుడి దర్శనం మనకు ఎలా లభిస్తుంది?' అని సూటిగా అడిగాడు. 'నిజమే... ఇంద్రధనుస్సు చూడాలంటే వర్షం తప్పదు. దైవానుగ్రహం కావాలనుకుంటే కొన్ని కష్టాలకు ఓర్చుకోవాలి' అని అర్థం చేసుకున్నాడు ఆ యువకుడు. కొండ మెట్లు చకచకా ఎక్కడం ప్రారంభించాడు. ఇద్దరూ స్వామివారి దర్శనం చేసుకుని వెనుదిరిగారు.

... ఆర్సీ కృష్ణస్వామి రాజు, 93936 62821





వెండి వెలుగుల పందిరి మాఘ పౌర్ణమి. చిమ్మ చీకటికి.. చంద్రుడు వెన్నెల వెలుతురుల తోరణాలు కడతాడు. అందుకే పౌర్ణమి నాటి రేయి ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. మన మనసులను ఆనందపరవశులను చేస్తుంది. మాఘ మాసంలో వచ్చే పున్నమినాడు చంద్రుడు పదహారు కళలతో వెలుగులీనుతాడు. ఈ పౌర్ణమినే మహామాఘం అనే పేరుతో పండుగలా పాటిస్తారు. పౌర్ణమి నాడు చంద్రుడు మఖ నక్షత్రానికి సమీపంగా ఉంటాడు. అందుకే ఈ నెలకు మాఘం అని పేరు. 'మఘం' అంటే యజ్ఞం. యజ్ఞయాగాది క్రతువులకు దీనిని శ్రేష్ఠమైన మాసంగా శాస్త్రాలు చెబుతున్నాయి.

# మహామాఘం.. పుణ్యస్నానం

న సమం భవితా కించిత్తేజః సౌరేణ తేజసా।
తద్వత్ స్నానేన మాఘస్య నా సమాః క్రతుజాః క్రియాః॥
'సూర్యుడి తేజస్సుకు సాటి వచ్చే కాంతి మరొకటి లేనట్టే, మాఘస్నానానికి సాటివచ్చే క్రతువు గాని, క్రియ గాని మరొకటి లేద'ని శాస్త్ర వచనం. పాప రాహిత్యం కోసం నదీస్నానాలు చేయడం మాఘమాస సంప్రదాయం. ఇది సకల కలుషాలను హరిస్తుందని విశ్వాసం. మాఘస్నాన మాహాత్మ్యాన్ని బ్రహ్మాండ పురాణంలో విశేషంగా ప్రస్తావించారు. ఈ నెల ప్రత్యూష కాలంలో చేసే స్నానానికి ఎంతో విశిష్టత ఉంది. బ్రహ్మాండ, నారదాది పురాణాలు మాఘ స్నాన విశేషాలను విస్తారంగా ప్రస్తావించాయి. ఈ స్నానం వల్ల అందం, ఐశ్వర్యం, ఆరోగ్యం, ఆయుర్దాయంతోపాటు మంచితనం, ఉత్తమశీలం లభిస్తాయని పద్మపురాణం పేర్కొంది. మృకండుడు, మనస్విల మాఘస్నాన ఫలమే వారి కుమారుడైన మార్కండేయుని అపమృత్యు దోషాన్ని తొలగించిందని పురాణ కథనం. ఈ పుణ్యస్నానం సమంత్రకంగా, సంకల్పం చెప్పుకొని చేయాలి. ఏదైనా కారణం వల్ల మాఘస్నానం చేయలేకపోతే కనీసం స్నానం చేసిన వారిని దర్శించి, వారికి శక్తి మేరకు దక్షిణ తాంబూలాదులు ఇచ్చి సత్కరించి, నమస్కరించినా పుణ్యం వస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి.

దుఃఖ దారిద్ర్య నాశాయ శ్రీ విష్ణోస్తోషణాయచ
ప్రాతః స్నానం కరోమ్యద్య మాఘే పాప వినాశనం।
మకరస్థే రవౌ మాఘ గోవిందాచ్యుత మాధవ
స్నాననేనానే నమోదేవ యథోక్త ఫలదోభవ॥
అనే శ్లోకం పఠిస్తూ, ప్రయాగను స్మరించుకుంటూ మాఘస్నానం చేసి సూర్యునికి అర్ఘ్యం ఇవ్వాలి. ఆ తర్వాత ఏదైనా ఆలయానికి వెళ్లి, దీపారాధన చేయాలి. ఈ మాసంలో శివాలయంలో నువ్వుల నూనెతో దీపారాధన చేస్తే ఎంతో మంచిది.

**నీటికి** ఉన్న శక్తి అమేయమైంది. స్నాన, ఆచమన మార్గాల్లో జలశక్తి మానవుడికి అందుతుందని వేద వాక్కు. స్నానం దేహాన్ని శుద్ధి చేయడంతోపాటు మనలోని ప్రకోపాలను తగ్గించి, స్థిరత్వాన్ని కలిగిస్తుంది. అందుకే స్నానాన్ని నిత్యవిధిగా పెద్దలు ప్రకటించారు. 'నిత్య స్నానం, నైమిత్తిక స్నానం, కామ్య స్నానం, క్రియాంశ స్నానం, అభ్యంజన స్నానం, క్రియా స్నానం' అని ఆరువిధాల స్నానాలు ఉన్నాయి. వీటిలో వైశాఖ, కార్తిక, మాఘ మాసాల్లో చేసే స్నానాలు, యజ్ఞయాగాదుల్లో చేసే స్నానాలను కామ్య స్నానాలుగా చెబుతారు.

**సూర్యుడు** చరించే రాశిని బట్టి సూర్యోదయ సమయంలో భానుడి కిరణాలు ఒక ప్రత్యేక కోణంలో భూమిని చేరుతాయి. ఆ సమయంలో సూర్యకిరణాల్లో ఉండే లోహిత, అతినీల లోహిత, పరారుణ కిరణాల సాంద్రతల్లో మార్పులు వస్తాయి. ఆధునిక వైజ్ఞానికులు కూడా జనవరి 20 నుంచి మార్చి 30 వరకు సూర్యోదయానికి పూర్వం చేసే స్నానం శ్రేష్ఠమైనదని, ఎంతో ఆరోగ్యకరమైందని చెబుతున్నారు. ఈ కోణంలో చూసినా మాఘస్నానం ఎంతో ఆరోగ్యకారకం.

### సముద్రస్నానం ఎందుకు చేయాలి?

'నదీనాం సాగరో గతిః'- సకల నదీనదాలు తమ ప్రవాహం పూర్తి చేసుకుని చివరికి సముద్రంలోనే సంగమిస్తాయి. కనుక, సముద్ర స్నానం చేస్తే సకల నదుల్లోనూ స్నానం చేసిన పుణ్యఫలం దక్కుతుంది. ముఖ్యంగా సముద్రుడి ప్రత్యేకత ఏమిటంటే ... నిత్యం సూర్యకిరణాల వల్ల ఎంతో నీరు ఆవిరి అవుతున్నా సముద్ర పరిమాణం తగ్గదు. అలాగే, ఎన్నో జీవనదులు తనలో కలుస్తున్నా సాగరుడి పరిమాణం పెరగదు. స్థిరత్వం ఆయన ధర్మం. అలాగే, ఎన్ని ఆటుపోట్లు ఎదురైనప్పటికీ మనిషి స్థిరత్వాన్ని కోల్పోకూడదు. సాగర స్నానం అందించే సందేశం ఇదే.

**సాగరుడు** సంతోషప్రదుడు. సంవత్సరంలో నాలుగుసార్లు సాగర స్నానం చేయాలనీ, అవి కూడా 'ఆషాఢ పూర్ణిమ, కార్తిక పూర్ణిమ, మాఘ పూర్ణిమ, వైశాఖ పూర్ణిమ' పర్వదినాల్లో చేయాలని, అలా సాగర స్నానాలు చేసినవారికి సముద్రుడు సంపూర్ణ ఆరోగ్యం కలుగజేస్తాడని పురాణాలు చెబుతున్నాయి. నదీప్రవాహ వేగానికి ఎదురుగా నడుము మునిగే వరకూ నిలబడి, కనీసం 48 నిమిషాల పాటు స్నానం చేయాలని విధి. అది కూడా సూర్యోదయానికి గంటన్నర ముందు కాలంలోనే చేయాలి.

**నీటిలో** విద్యుచ్ఛక్తి ఉందని సైన్సు చెబుతుంది. కానీ, ఈ సైన్సు పుట్టక ముందే ఈ సత్యాన్ని గుర్తించిన మన మహర్షులు బ్రాహ్మీ ముహూర్తాన్ని నదీ / సాగర స్నానానికి అనుకూల సమయంగా నిర్ణయించారు. సూర్యోదయ కాలం నుంచి, సూర్యాస్తమయం వరకూ ప్రసరించే సూర్యకిరణాలలోని విద్యుచ్ఛక్తిని నదీజలాలు, సాగర జలాలు తమలో నిక్షిప్తం చేసుకుంటాయి. చంద్రుడు తన కిరణాలలోని అమృతత్వాన్ని, ఔషధీ విలువలను నదీజలాలకు అనుగ్రహిస్తాడు. నీటిలో ఉండే ఈ అద్భుతశక్తులు తిరిగి సూర్యకిరణాలకు పరావర్తనం చెంది అంతరించి పోతాయి. అందుకే సూర్యోదయానికి పూర్వమే స్నానం పూర్తి చేయాలనే నియమాన్ని విధించారు పెద్దలు.

**మరి** 'నడుము మునిగే వరకూ నదీ ప్రవాహ వేగానికి ఎదురుగా ఎందుకు నిలబడాలి' అన్న సందేహం రావచ్చు. గర్భస్థ శిశువుగా ఉన్న పిండానికి నాభినాళం ద్వారానే జీవశక్తులు అందుతాయన్నది ఎవరూ కాదనలేని సత్యం. సాగర, నదీజలాలలో నిక్షిప్తమైన సౌరశక్తి, సోమశక్తులను ఈ నాభి నుంచి శరీరం గ్రహిస్తుంది. అందుకే నాభి మునిగే వరకూ నదిలో నిలబడి స్నానం చేయాలి. సముద్రానికి ప్రవాహం లేకపోయినా, ఉత్తుంగ తరంగాలు తమ తాకిడితో ఆ శక్తులను శరీరానికి అందజేస్తాయి. కనుకనే సముద్రుణ్ని పూజిస్తూ చేసే నాలుగు స్నానాలలో 'మాఘ పూర్ణిమ' స్నానం ముఖ్యమైనది.

**మాఘ** మాసంలో దేవతలు తమ సర్వశక్తులు, తేజస్సులను జలాల్లో ఉంచుతారు. సముద్రం, నదులు అందుబాటులో లేని పరిస్థితిలో బావుల దగ్గర గానీ, చెరువుల వద్దగానీ 'గంగ, సింధు, కావేరి, కృష్ణ, గౌతమి' నదుల పేర్లు స్మరిస్తూ స్నానం చేస్తే ఆయా నదుల్లో స్నానం చేసిన ఫలితం వస్తుంది. దేనికైనా భక్తి ప్రధానం. అది లేనప్పుడు ఎన్నిసార్లు కాకిలా మునిగి, కర్రలా తేలినా ఫలితం శూన్యం.

**మాఘమాసంలో** సూర్యోదయానికి పూర్వం గృహ స్నానం చేసినా ఆరు సంవత్సరాలపాటు అఘమర్షణ (మంత్ర సంకల్ప) స్నాన ఫలం లభిస్తుందని శాస్త్ర వచనం. బావినీటి స్నానం పన్నెండేళ్ల పుణ్యఫలాన్ని, తటాక స్నానం ద్విగుణం, నదీస్నానం చతుర్గుణం, మహానదీ స్నానం శతగుణం, గంగాస్నానం సహస్రగుణం, త్రివేణీ సంగమ స్నానం నదీశతగుణ ఫలాన్ని ఇస్తాయి. మాఘస్నానంలో దివ్య తీర్థాలను స్మరించి పాపవినాశనం కోరుతూ స్నానం చేయడం సంప్రదాయం. స్నాన సమయంలో 'ప్రయాగ'ను స్మరిస్తే ఉత్తమ ఫలం లభిస్తుంది.

**స్నానాంతరం** సమస్త జీవరాశికి ఆధారమైన సూర్యభగవానుడికి అర్ఘ్యం సమర్పించాలి. వైష్ణవ ఆలయానికి గానీ, శివాలయానికి గానీ వెళ్లి దర్శనం చేసుకోవాలి. అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించడమే కాకుండా శక్తిమేరకు దానధర్మాలు చేయాలి. ఈ రోజున గొడుగు, నువ్వులు దానం చేస్తే విశేష ఫలం లభిస్తుంది. దీని వల్ల జన్మజన్మలుగా వెంటాడుతున్న పాపాలు, దోషాలు నశిస్తాయని నమ్మకం.

... డా॥ కప్పగంతు రామకృష్ణ

ఉపనిషత్ సారం

# అగ్నిదేవుని అనుగ్రహం

అగ్నే నయ సుపథారాయే అస్మాన్
విశ్వాని దేవ వయునాని విద్వాన్।
యుయోధ్యస్మజ్జు హురాణమేనో
భూయిష్ఠాం తే నమ ఉక్తిం విధేమ॥
(ఈశావాస్య ఉపనిషత్తు)

'అగ్నిదేవా! మమ్మల్ని మంచి మార్గంలో నడిపించు. నీకు అన్ని కర్మలూ తెలుసు. మా పాపాలు విడిపించు. నీకు నమస్కారం..' అని పై ఉపనిషత్ శ్లోకానికి భావం. బ్రహ్మజ్ఞానానికి అగ్ని ఉపాసన చాలా ముఖ్యం.

అరుణాస్పదపురంలో అందగాడు, శీలవంతుడు అయిన ప్రవరుడు అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. ఎన్నో తీర్థక్షేత్రాలు దర్శించిన ఒక సిద్ధుడు 'ఈ పాదలేపంతో ఎక్కడికైనా వెళ్లవచ్చు' అని ఒక పసరు ప్రవరుని పాదాలకు పూశాడు. ప్రవరుడు హిమాలయం చూడాలనుకున్నాడు. మరుక్షణంలో అక్కడికి చేరుకున్నాడు. అనేక పవిత్ర ప్రదేశాలు దర్శించుకున్నాడు. ఇంటికి వెళ్దామనుకుంటే... మంచు వల్ల పసరు కరిగిపోయింది. దిక్కు తోచక హిమగిరుల్లో సంచరిస్తున్న ప్రవరుడికి దూరం నుంచి ఏదో గానం వినిపించింది. ఆశ్రమం అనుకొని అటుగా వెళ్లాడు. ఒక భవనాన్ని, ఉద్యానవనాన్ని, మధురంగా వీణ మీటుతూ పాడుతున్న దేవకాంతను చూశాడు. 'నన్ను ప్రవరుడు అంటారు. దారి తప్పాను. మా ఊరికి వెళ్లే మార్గం చెప్పి పుణ్యం కట్టుకో!' అని ఆ దేవకాంతను అడిగాడు. ఆమె పేరు వరూధిని. అందచందాల ప్రవరుణ్ని చూడగానే ఆమె అతణ్ని మోహించింది.



మరోవైపు తన అగ్నిహోత్రానికి ఆలస్యం అవుతుందని బాధపడుతున్నాడు ప్రవరుడు. 'ఈ ఇసుక తిన్నెలలో, పొదరిళ్లలో నాతో స్వర్గసుఖాలు అనుభవించు' అని ప్రవరుడితో అన్నది వరూధిని. 'నా తల్లిదండ్రులు వృద్ధులు. ఆకలితో నిరీక్షిస్తారు. నన్ను త్వరగా ఇల్లు చేర్చండి' అని బతిమలాడు ప్రవరుడు. 'ఇంద్రియాల సుఖమే పరబ్రహ్మం' అన్నదామె. ఐహిక సుఖాల పట్ల వైముఖ్యాన్ని, వైదిక కర్మల ధర్మపరత్వాన్ని వినిపించుకోలేదు. పైగా కౌగిలించుకోబోయింది. ప్రవరుడు 'హరి హరీ' అని ఆమెను పక్కకు తోసేశాడు. వరూధిని పరాభవంతో విలపించింది. ఆమె హత్తుకోబోతే అంటిన సుగంధ ద్రవ్యాలను ప్రవరుడు కోనేటిలో కడుక్కొని పవిత్రుడై ఇలా ప్రార్థించాడు. 'హవ్యవాహనా! నేను దాన జపాగ్ని హోత్రాలు తప్పనివాడినైతే త్రికరణ శుద్ధిగా నీ భక్తుడినైతే పరసతులను కోరని వాడినైతే నన్ను పొద్దువాలక ముందే సగౌరవంగా ఇంటికి చేర్చు' అని వేడుకున్నాడు. మరుక్షణంలో అగ్నిహోత్రుడు దివ్య తేజస్సు ప్రసాదించాడు. క్షణంలో ప్రవరుడు తన ఇంట్లో ఉన్నాడు. నిత్యకర్మలు నిర్విఘ్నంగా నిర్వర్తించుకున్నాడు. అగ్నిని ఆరాధించే నిష్ఠాగరిష్ఠులు ఇలా ఉంటారని ప్రవరుడి వృత్తాంతం తెలియజేస్తుంది.

... డా॥ వెలుదండ సత్యనారాయణ

క్రీస్తు సందేశం



# నైతికబలమే ఆత్మశక్తి


**ప్రభువు** చుట్టూ ప్రజలు తండోపతండాలుగా ఉండేవారు. ఆయన సన్నిధిలో ఆకలి నిద్రలు మరచి పులకించిపోయేవారు. ప్రభువు పలుకులే వారికి దివ్యౌషధాలు. అలాంటి వారిని అప్పుడప్పుడూ కొందరు అహంకారులు పట్టి పీడించేవారు. వారిపై దౌర్జన్యానికి పాల్పడేవారు. అయినా వారంతా మొక్కవోని ధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో ప్రభువు దగ్గరే అచంచలమైన దీపాల్లా వెలుగుతుండేవారు. వారిని చూసి జాలిపడిన ప్రభువు.. 'ఆత్మవిషయమై దీనులైన మీరు ధన్యులు; పరలోకరాజ్యము మీదే' అని ఊరట కలిగించేవారు. ప్రభువు కొండమీద కూర్చొని అలా పలుకుతుంటే, చిన్నగా జాలువారే అమృతధారలు వారిలో జీవం ఉప్పొంగించేవి. అలా ఆయన మాటలు దుఃఖపడే వారిని ఓదార్చేవి. నీతి కోసం నిలబడే నైతిక బలమే ఆత్మశక్తిని, తృప్తినీ ఇస్తాయని ప్రభువు వారికి బోధిస్తుండేవారు. ప్రభువు బోధనలు ఆధ్యాత్మిక, భౌతిక, తాత్వికతకు మూలబీజాలుగా ఉండేవి. ఎందరెందరో బాధితుల జీవితాల్లో కొత్త ఆశలు చిగురింపజేసేవి. బాధితుల మనసుకు సాంత్వన చేకూర్చేవి.

... ప్రొ॥బెర్నార్డ్ రాజు, 98667 55024

గురువారం షబే బరాత్

# మన్నింపు లభించే రాత్రి

**ప్రవక్త** (స) సతీమణి ఒకసారి అర్ధరాత్రి నిద్రలేచి చూసేసరికి ఆయన కనిపించ లేదు. ఆమె వెతుక్కుంటూ బయటికి వెళ్లింది. జన్నతుల్ బఖీ అనే ఖనన వాటికలో సమాధుల మధ్య ప్రవక్త (స) కనిపించారు. హుటాహుటిన ఆయన దగ్గరికి వెళ్లింది. భార్యను చూసిన ప్రవక్త (స) 'ఆయిషా! నన్నే అనుమానిస్తున్నావా? అల్లాహ్ మన్నింపు, కారుణ్యం కురిసే రేయి ఇది, అందుకే ఈ సమాధుల్లో శాశ్వతంగా నిద్రిస్తున్న వారి మన్నింపు కోసం అల్లాహ్‌ను వేడుకుంటున్నాను' అని తన సతీమణికి వివరణ ఇచ్చారు ముహమ్మద్ ప్రవక్త (స).



షాబాన్ నెల 15వ తేదీ అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన ఇస్లామీయ చరిత్రలో నిలిచిపోయింది. రంజాన్ నెలకు 15 రోజుల ముందు జరిగిన ఈ ఘటనను 'షబే బరాత్'గా జరుపుకొంటారు. ఆ రోజు రాత్రంతా ముస్లింలు జాగారం చేస్తూ మసీదుల్లో నమాజులు ఆచరిస్తారు. తమ పూర్వీకుల సమాధులను సందర్శిస్తారు. వారి మగ్ఫిరత్ (మన్నింపు) కోసం దువా చేస్తారు. దువా అంటే వేడుకోలు. షాబాన్ నెల తొలి పదిహేను రోజులు ప్రవక్త (స) ఉపవాసాలు పాటించి రమజాన్‌కు సంసిద్ధులయ్యేవారు. శుభాలు సమృద్ధిగా వర్షించే షాబాన్ నెలలో నిర్లక్ష్యానికి తావివ్వకూడదు. రంజాన్ నెలను స్వాగతించే విధంగా ఎవరికి వారు సన్నద్ధం కావాలి. వీలైనన్ని ఎక్కువ ప్రార్థనలు చేసి దైవ సాన్నిధ్యాన్ని పొందాలి' అంటారు అబ్దుల్ ఖాదిర్ జీలానీ (రహ్మాలై) మహనీయులు.

సమాధులను సందర్శించడం వల్ల కనువిప్పు కలుగుతుందని ఉలేమాలు షబే బరాత్ సందేశాన్ని వివరిస్తారు. ఖబరస్తాన్ (ఖనన వాటిక)లో ప్రవేశించేటప్పుడు 'అస్సలాము అలకుం యా అహలల్ ఖుబూర్' అని చెబుతూ లోనికి ప్రవేశించాలి. 'సమాధుల్లో నిద్రిస్తున్న మీపై శాంతిశుభాలు కురియుగాక' అన్నది దాని అర్థం. 'కాసేపు ఖబరస్తాన్‌లో మౌనంగా కూర్చోండి. సమాధుల్లో ఉన్న మౌన సందేశాన్ని వినండి' అని మౌలానా జలాలుద్దీన్ రూమీ చెబుతారు. 'మన తుది ప్రయాణం సమాధి, కొన్ని మంచి పనులైనా చేసుకో. ఒకరింటికి వెళ్లినప్పుడు ఒట్టి చేతులతో వెళ్లం కదా' చివరి మజిలీకోసం ఏర్పాట్లు చేసుకోవాలని ఉలేమాలు చెబుతారు.

... ముహమ్మద్ ముజాహిద్
96406 22076